
# పట్నంలో గుడిసె



ఆ మర్రిచెట్టు ఎన్నో కాలాల్ని చూసింది. ఆ నీడ ఎందరినో ఆదుకుంది. అక్కడే అమ్మోరి గుడి వెనుక గుడిసెలో 'వీరేశు' నివాసం. మూడు పదులు దాటింది. ఎండ తగలదు. వానకి తడవదు. దట్టంగా క్రిందివరకు జడల్లా వ్రేలాడుతూ గాలికి అటూ ఇటూ ఊగిసలాడుతున్నాయి. ఆ కూడలిలో ఉన్న ఆ చిన్ని గుడిసెను పూర్తిగా తన ఒడిలోకి తీసుకున్నట్లుంది మర్రిచెట్టు. ఆ ప్రక్కనే ఓ తాటిచెట్టు ఆ గ్రామ దేవతగా వెలిసింది. గుడిలో వున్న అమ్మవార్ని కొలిచాక, పసుపు,కుంకుమలతో బాజాభజంత్రీలతో మొక్కు బళ్ళు సాగిస్తారు.

గుడిసే ముందర పడివున్న ఆకుల్ని తుడుస్తూ 'గంగ' తనవైపే వస్తున్న భర్త 'వీరేశు'ని చూసి ఒక్క నిముషంలో ఆనందంతో తబ్బిబ్బు అయి చేతులు చాచింది.

" ఓరయ్యో! నువ్వు క్యాటిల్ బార్ పట్టుకెళ్ళినప్పుడే అనిపించింది, ఈ పూట పిట్టమాంసం రుచి చూడొచ్చులేనని, బలేగ తెచ్చావ్" అంటూ గంగ భర్త వీరేశు చేతిలోని పావురాన్ని అందుకుంది.

వీరేశు క్యాటిల్‌బార్‌తో గురిపెట్టాడంటే ఏపక్షి అయినా క్షణాల్లో చేతికి చిక్కిపోవలసిందే వీరేశు ఎక్కడివాడో, ఎప్పటివాడో తెలియదు గాని ఎరుకజాతి వాడని వినికిడి కాని బుట్టలల్లే మేదరి వృత్తిగా చేసుకున్నాడు. అతి పెద్ద పట్టణంలో నాలుగు రోడ్ల కూడలికి కాస్తంత దూరంలో ఆమ్మోరి ఆలయం వెనుక ఖాళీ స్థలంలో సన్నపాటి దుంగలు, వెదురుకఱ్ఱలు, తడికెలు, తాటాకులతో వీరేశు స్వయంగా గుడిసె వేసుకున్నాడు.

వయస్సు ఏభైకి పైబడినా పాతికేళ్ళ వయసున్న వాడిలా కండలు తిరిగిన శరీరం, చామనఛాయ రంగు, ఒంటికి గుడ్డే కరువైనట్లు గోచి, తుండుగుడ్డ కట్టుకుంటాడే తప్పించి బట్టలు వేసుకోవడం చాలా అరుదు.

నిత్యం మఱ్ఱిచెట్టు క్రింద కూర్చుని వెదురు బద్దల్ని కొడవలితో చీరి, అతి సునాయాసంగా తడికెల్ని, బుట్టల్ని, చాపల్ని అల్లుతూ వుంటాడు.

'గంగ' వీరేశుకి మూడో పెళ్ళాం. మొదటావిడడకి మూడేళ్ళ కూతురుండగా, ఓ అర్ధరాత్రి వీరేశు పుష్టిగా నాటుసారా బిగించి, చడీచప్పుడు లేకుండా పెళ్ళాం పీకనులిమి చంపేసి, పొద్దెక్కక ముందే స్మశానంలో పాతేసి వచ్చేసాడు. మూడోరోజే కూతురిని, తనకు గంజిపోయడానికి కన్నట్లు మరో ఆమెను తెచ్చిపెట్టుకున్నాడు.

సమసమాజంలో వుంటూ తన కష్టసుఖాలు ఎవరితోను ముడిపెట్టక, ఒకరి పంచన చేరక, ఎవరికీ లొంగక తన బతుకు బతుకుతూ ఒంటరి పోరాటంలో జీవనయానం సాగించడం ఒక్క 'వీరేశు' లాంటి వాడికే తగునేమో!

ఒక్క పిల్లాడు పుట్టాక వీరేశు రెండో భార్యకు తెగులు పుట్టింది. సవతి బిడ్డను వీధిలోకి నెట్టడానికి ప్రయత్నించింది. వీరేశుకి కోపమొచ్చింది. చేతిలోవున్న పదునైన కొడవలినే ఎత్తాడు. ఆమెకు పౌరషం వచ్చింది. వీరేశు కర్కశత్వానికి తట్టుకోలేక మరో గూటికి ఎగిరిపోయింది. వీరేశు ఏమీ చలించలేదు. ఇద్దరు పిల్లల్ని కూడదీసుకొని కాలక్షేపం చేస్తూ వయస్సులో ఉన్న 'గంగ'ని తోడుగా తెచ్చిపెట్టుకున్నాడు. కొడుకుని వెంట తిప్పుకొని అన్ని విద్యలు నేర్పించాడు.

వెదురు బుద్దలతో శవాలకు పాడికట్టి అమ్మేవాడు. అర్ధరాత్రి దాటాక చావులమదం

దాటి స్మశానానికి పోయి అవే ఏరుకొని కట్టకట్టి తెచ్చి, వాటితో అందంగా చాపలు, బుట్టలు, తడికెలు అల్లి అందరికీ అమ్మేవాడు. ఆడవాళ్ళు, మగవారు వాటిల్లో అన్ని రకాల కాయల్ని నింపుకొని, ముక్కలుగా తరిగించుకుని వీరేశుకి దండిగా డబ్బులిచ్చేవారు. వీరేశు కత్తి పదును కూడా అలాంటిదే. ఎండాకాలం వచ్చిందంటే! వీరేశు కత్తికి మరింత గిరాకీ పెరిగేది. కొబ్బరిబొండాలు నిముషానికొకటి తెగిపడేవి. ప్రతి కాయకి వచ్చే చిల్లర సాయంత్రం అయ్యేసరికి ఎంతో పోగయ్యేది.

ఏడాదికి మూడు, నాలుగుసార్లు గ్రామదేవత జాతర జరగడం ఆనవాయితీ. అప్పుడు ఎవరూ చేయలేని పని వీరేశు చేసేవాడు. అమ్మోరికి కోడిపిల్లలు, మేకపోతులు వీరేశు కత్తికి బలికావలిసిందే. ఆరక్తంతో వీరంగం చేస్తూ లెక్కలేనంత డబ్బులు తన జోలెలో నింపుకుంటాడు.

ప్రతి అమ్మవారి పండుక్కి 'గుడి' సంరక్షకులు, కమిటీ సభ్యులు, ధర్మకర్తలు అందరూ పెద్దలే. వచ్చే ఆదాయం అంతా లెక్కలు వేసుకుని పంచుకుంటారు. వారితో పాటు వీరేశుకి కూడా ఎంతోకొంత మొత్తాన్ని యిచ్చి సంతృప్తి పరుస్తారు. లేకపోతే వీరేశు మందు కొట్టి తన కొడవలితో వీరంగం సృష్టిస్తాడు. అనధికారులు, అధికారుల జోలికి మాత్రం వీరేశుపోడు. ఎవరి అవసరానికి వారొచ్చి వెళ్ళడమే.

అందుకే రోడ్డు ప్రక్క చెట్టు క్రింద, గుడి వెనుక స్థలం ఆక్రమించుకున్నా ప్రశ్నించి, ఆక్షేపించే వారు లేరు. పట్టణంలో ప్రతీ గజానికి విలువ ఉంటుంది. వీరేశు గుడిసెకి విలువ కట్టేవారులేరు. నిత్యం గోచీగుడ్డతో వీధిలో రోడ్డు మీదనే కూర్చొని వెదురు బద్దల్ని చీల్చుకుంటూ తన పనిలో తాను నిమగ్నమై వుంటాడు. అదే రోడ్డు మీద చిల్లర వ్యాపారులున్నా, బిచ్చగాళ్ళున్నా పోలీసులొచ్చి దూరంగా నెట్టేస్తారు.

తననెవరు పట్టించుకోరనే ధైర్యంతో వీరేశు ఆగడాలు మరింత పెరిగాయి.

రోడ్డుకి ఆవలి వైపు వీధి అరుగు మెట్ల క్రింద చాపవేశాడు. సాయంత్రం పూట తాగి పారేసిన కొబ్బరిబొండాలు తెచ్చుకుని అందులో నాటుసారా పోసి బిచ్చగాళ్ళకి యిచ్చి వారి దగ్గరున్న చిల్లర డబ్బంతా గుంజుకునేవాడు. పెంటమీద పారేసిన సీసాల్ని తెచ్చుకుని చవక బారు బ్రాందీతో నింపి, కాళ్ళూ చేతులు లేని బిచ్చగాళ్ళ దగ్గరికిపోయి మందుసీసా యిచ్చి వారిదగ్గరున్న డబ్బంతా మెల్లగా కాజేసేవాడు. ఎవరో ఒకరు వీరేశు దగ్గర డబ్బు తృణమో ఫలమో చెల్లించుకుని సారాబొండాం గుక్కపట్టి దిగమ్రింగి మరీ త్రేన్చి

వెళ్లిపోవడం ఎవరికీ తెలియదనుకున్నా ఆ ప్రక్కనే ఉన్న, ఎస్టీడీబూత్ నడుపుతున్న శేష మాత్రం ఒక కంట కనిపెడుతూనే వున్నాడు.

శేషు ఎంతోకాలంగా ఎస్టీడీబూత్ నడుపుతున్నాడని, నిరాడంబరుడని, మంచివాడని వీరేశు దృష్టిలో యిది వరకే వున్నాడు.

ఒకరోజు సాయంత్రం అయ్యేసరికి గ్రామదేవత అమ్మోరి జాతర, డప్పులు, డోలు,బాజా భజంత్రీలతో మొదలైంది. వీధి చివరి వరకు రంగురంగుల దీపాలతో తోరణాలు కట్టారు. గుడిముందర, తాటిచెట్టు దగ్గర పెద్ద పందిరి వేసారు. మర్రిచెట్టుకు ట్యూబ్‌లైట్లు కట్టారు. పందిరి నిండా మామిడాకులు, పూలదండలు వ్రేలాడదీసారు.

కొంతమంది దేవీ ఔపాసన పట్టి, పూనకం వచ్చిన వారిలా డప్పు వాగిస్తుంటే గెంతుతుంటే జనం మూగి చప్పట్లు, ఈలలు వేయసాగారు. పసుపు, కుంకుమ బొట్లు పెట్టుకున్న ముత్తయిదువులు బిందెలతో నీళ్ళు తెచ్చి జల్లుతూ ముగ్గులు పెట్టేరు.

డప్పులు, బాజాలు మ్రోగుతుంటే ఆ వీధిలో జనం తండోపతండాలుగా రావడం మొదలైంది. అలజడిగా అట్టహాసంగా వుంది. వాహనాలు దారిమళ్ళించారు పోలీసులు. అమ్మవారిని దర్శించుటకు ప్రముఖులు, అతిథులు ప్రత్యేకంగా వచ్చి కొబ్బరికాయలు, పళ్ళు, చీర, రవికె సమర్పించారు. దక్షిణలు వేసి మ్రొక్కుబడులు తీర్చుకుంటున్నారు. అంతా కాలం తెలియని సందడిలో వున్నప్పుడు వీరేశు, శేషు దగ్గరకొచ్చి, చాటుమాటుగా ఒక ప్లాస్టిక్ సంచిని అందించి జాగ్రత్త చేయమని చెప్పి వెళ్ళిపోయాడు.

వీరేశు అమ్మోరు జాతరలో లీనమై జంతుబలి రక్త తర్పణంలో మునిగి, ఎర్రబారిన రుద్రుడిలా వున్నాడు. దొమ్మీ, తోపులాట, భక్తుల రద్దీ తాకిడి తగ్గేసరికి రాత్రి పన్నెండు దాటింది. అకస్మాత్తుగా వీరేశు తడికెల గుడిసెకు నిప్పు రాజుకుంది. క్షణంలో చూస్తుండగా కరెంట్ వైరు అంటుకుంది. రోడ్డంతా దీపాలు ఆరిపోయి చీకటి క్రమ్ముకుంది. అంతా చెల్లాచెదురైపోయారు. వీరేశు భార్య పిల్లలు వీధి చివరి నుండి పరుగెత్తుకొచ్చి వీరేశుని వాటేసుకున్నారు. వీరేశు గుడిసె మాత్రమే కాలిబూడిదైపోయింది. అంతా షాట్ సర్క్యూట్ జరిగి వుండి వుంటుందనుకున్నారు. మర్రిచెట్టు ఆకులు, కొమ్మలు, ఎండిన ఊడలు కాలి నల్లబారిపోయింది. చెట్టుపై వున్న పక్షులు చిన్నాభిన్నమైన ఎగిరిపోయాయి. ఆ రాత్రి వీరేశు అమ్మోరు గుడి ప్రాంగణంలో చోటు చేసుకున్నాడు.

వీరేసు బ్రతుకు రోడ్డు పాలైందని అంతా విచారం వెలిబుచ్చారు. ఆలయ ధర్మ సంస్థాపకులు, కమిటీ మెంబర్లు, సంఘ నాయకులు, అధికారులు, అనధికారులు అంతా వచ్చి మానవతా ధృక్పథంతో సానుభూతి వ్యాఖ్యాలు పలుకుతూ తమకు తోచినంత డబ్బిచ్చి, దుస్తులు, సామగ్రి వగైరా అమర్చి ఆదుకునే పనిచేసారు. అంతేకాకుండా మళ్ళీ అక్కడే, అమ్మవారి గుడి వెనుక గుడిసె కట్టి యిస్తామని వాగ్ధానం చేసి మరీ వెళ్ళారు. అందరి ముడుపులు అందాక వీరేశు, ఎస్టీడీ బూత్‌లో వున్న శేషు దగ్గరకెళ్ళి తన కందిన డబ్బు మూటను తెచ్చియిచ్చాడు.

"బాబు గారు, కొంచెం లెఖ్ఖ చూసి పెడతారా, బ్యాంక్‌లో జమ చేయాలి." అన్నాడు. రాత్రి జరిగిన పరిస్థితి నుంచి యింకా తేరుకోలేనివాడిలా, శేషు వీరేశను చూసి బాధపడుతూ, " అయ్యా ! వీరేశు ఎంత పని జరిగిపోయింది ఆ టైంకి నేను లేను. తెల్లారగట్ల తెలిసి, పరుగెత్తికొచ్చి చూస్తే, గుడిసె పూర్తిగా కాలి పోయింది,ఎలా జరిగింది, షాట్ సర్క్యూట్ అయి వుంటుంది" అంటూ విచారం వెలిబుచ్చాడు.

శేషు వీరేశుకి అనునయ మాటలు చెప్తూ, మూట విప్పి చిల్లరకి చిల్లర, నోట్లకు నోట్లు విడివిడిగా లెక్క చూసాడు. సుమారు పదిహేను వేలవరకు తేలింది. అప్పుడే ఇద్దరు ఫైనాన్సర్స్ వచ్చి శేషుని నిలదీసారు. పాతబాకీ పది వేలు వెంటనే తీర్చమని ఒత్తిడి చేసారు. శేషు వారిని బతిమలాడి మరుసటి రోజు రమ్మని చెప్పాడు. అది చూసి వీరేశు "బాబుగారు ఈ డబ్బు అందాక వాడుకోండి, బ్యాంకులో జమచేసేదే కదాసారు," అన్నాడు అతిమామూలుగా. శేషు ముఖం మాడిపోయింది. నమ్మలేనివాడిలా గుడ్లురిమి చూసాడు.

వీరేశం స్థితిగతులు, చిరిగిన గుడ్డలు, చింపిరి జుత్తుతో తిరిగే వైనం, శవాలు పాడి కర్రల్ని ఏరుకొని వాటితో వ్యాపారం చేసేవాడు, తిరిగి జాలిచూపి, సహాయం చేస్తాననడం శేషుకి తలకొట్టేసినంతపనైంది.

శేషు సంశయిస్తున్నాడని తెలిసి, మాటమార్చి, ముందురోజు దాచుకున్న ప్లాస్టిక్ సంచిని ఇమ్మన్నాడు. అందులో నుండి కాగితాల్ని తీసి శేషుకిచ్చి చూడమన్నాడు, మళ్ళీ తనకెప్పుడు బ్యాంక్‌కి వెళ్ళాలో అడిగాడు.

శేషు వాటిని నిశితంగా పరిశీలించి చూసేసరికి, తల తిరిగింది. గుండె గుభేల్‌మంది. అందులో బ్యాంక్ మనీ బాండ్స్ వున్నాయి. వాటి విలువ లక్షకు పైగానే వుంది. శేషు రెప్పవాల్చకుండా చూడసాగాడు. వీరేశు మాత్రం ఏమీ చలనం లేని వాడిలా శేషు చేతిలో వున్న వాటిని తీసుకుని వెళ్ళడానికి సంసిద్ధమవుతూ 'అయ్యగారు,

ఈ మూటలో వున్న డబ్బెలా వచ్చిందనుకున్నారు. ఊరికినే రాలే, రాత్రి నా గుడిసెకి నేనే నిప్పుపెట్టాను. దాంతో అంంతా బేజారెక్కి తెల్లారేసరికి ఈ డబ్బిచ్చి ఆదుకున్నారు. మీరు గొప్పోరు, పట్నంలో గుడిసె లేని నా లాంటి వాడికి అంతకన్నా గతిలేదు. నా దగ్గర అప్పు తీసుకోడానికి మీకు నామోషి, పోన్లెండి, నాడబ్బెందుకు మీకు' అంటూ వెర్రిగా ఓ నవ్వు నవ్వి తన దారిన తాను వెళ్ళిపోయాడు.

శేషు స్థబ్దుడై అక్కడే చతికిలపడిపోయాడు.

(అక్టోబరు,2009)